క్లుప్తంగా

హెల్పింగ్‌హ్యాండ్స్ ఆర్థిక సాయం



తిలోత్తమకు సాయాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కవిటి: చిన్నసహలాలపుట్టుగకు చెందిన బెహెరా తిలోత్తమ త్వరలో పెళ్లిపీట లెక్కనుంది. అయితే ఈమెకు తల్లిదండ్రులు లేరు. ఈ నేపథ్యంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ చీర సారెలిచ్చి పుట్టింటి బాధ్యతలు స్వీకరించింది. కొన్నాళ్ల క్రితం తిలోత్తమ్మ తల్లిదండ్రులు మరణించారు. బంధువులు గ్రామస్తుల సహకారంతో పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యుడు బి.లక్ష్మణమూర్తి మాస్టార్ నేతృత్వంలో ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. పది వేల రూపాయల నగదు, రెండు బస్తాల బియ్యం, పట్టుచీర, గాజులు తదితర సారెను కానుకగా శుక్రవారం అందించి ఆదర్శంగా నిలిచారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పదో వార్డు కొత్తపార సాంబలోని ముత్యాల పోలమ్మ పురాతన గ్రామదేవత ఆలయం అభివృద్ధికి సహకారం అందించాలని వార్డు కౌన్సిలర్ శర్వాన గీతా కోరారు. శుక్రవారం ఆలయం నిర్మాణ పనులను పరిశీలించారు. తనవంతుగా పది వేల రూపాయలను విరాళంగా అందించారు. మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సహకారంతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆలయం వరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకున్నామన్నారు. పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కవిటి: జగనన్నకు చెబుదాం విభాగానికి, సచివాలయ స్పందనకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల కోసం అర్జీదారుడు తన సమస్యను తీసుకువస్తే అర్హత ఉంటే మంజూరు చేయడం, లేకుంటే ఏ కారణం చేత అనర్హుడో సెల్‌ఫోన్ సందేశం ద్వారా తెలపాలన్నారు.

బాధితులకు పరామర్శ

కాశీబుగ్గ: రైలు ఢీకొని గొర్రెలు చనిపోయి నష్టపోయిన మున్సిపాలిటీ మూడో వార్డు జయరామచంద్రపురానికి చెందిన బాధిత కుటుంబాలను పలువును నాయకులు శుక్రవారం పరామర్శించారు. కిక్కర సోమేశ్వరరావు, బద్రి సింహాద్రిలకు చెందిన గొర్రెలు మృతి చెందడంతో వారి కుటుంబాలకు పరామర్శించి ధైర్యం చెప్పారు. సమస్యను మంత్రి సీదిరి అప్పలరాజు, పశువైద్యశాఖ ఉన్నత అధికారుల దృష్టి తీసుకెళ్తామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కోటబొమ్మాళి: అక్కయ్యవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ సుంకరి జనార్దన కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. పొక్లయినర్‌తో మట్టిని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడ బొడ్డు అప్పన్న, వార్డు సభ్యుడు నందికి శిమ్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఇండస్ట్రీయల్ ఏరియా అభివృద్ధికి అందరూ సహకరించాలని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి శాశనపురి శ్రీను పాల్గొన్నారు.

జాగృతి సభ్యులకు వ్యాసరచన పోటీలు

కోటబొమ్మాళి: ఇటీవల గ్రామాల్లో ఎంపిక చేసిన జాగృతి సభ్యులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేనే పోలీస్‌నైతే-సమాజానికి ఇలామేలు చేస్తాను అనే అంశంపై పోటీలు నిర్వహించినట్టు ఎస్సై షేక్ మహమ్మద్ అలి తెలిపారు. విజేతలకు జిల్లా ఎస్పీ రాధిక చేతులమీదుగా శనివారం బహుమతులు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పలాస మండలం కేదారిపురం గ్రామానికి చెందిన పాడి తిరుపతిరావు (32) ద్విచక్ర వాహనంపై మొగిలిపాడు నుంచి కాశీబుగ్గ వైపు కోసంగిపురం కూడలి మీదుగా వేరే మరో వ్యక్తితో కలిసి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వాహనం బోల్తా పడడంతో తిరుపతిరావు తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ప్రాణం నిలవలేదు. వాహనం వెనుక కూర్చున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనపై కాశీబుగ్గ ఏఎస్సై గణపతి కేసు నమోదు చేశారు. మృతుడు తిరుపతిరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సంక్షేమాన్ని ఓర్వలేక పిచ్చి ప్రేలాపనలు

- వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- మంత్రి సీదిరి అప్పలరాజు

మందస:

సంక్షేమాన్ని ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి అందిస్తున్న సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హంసరాలి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పేదలకు అందిస్తున్న పథకాలు చంద్రబాబుకు రుచించడం లేదన్నారు. ఎల్లప్పుడూ రాజకీయాలే తప్ప అభివృద్ధిపై ఆయనకు ధ్యాసలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పొరపాటును కూడా తప్పు చేయవద్దని, ఇదే జరిగితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చంద్రబాబు రద్దు చేస్తాడన్నారు. ప్రజలు జన్మభూమి కమిటీల బాధితులుగా మిగిలిపోతారన్నారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్టని, ఆయన మాటలు నమ్మవద్దని హితవు పలికారు. ఈ ప్రాంతంలో గొతు వారసత్వ రాజకీయాలకు కాలం చెల్లించదన్నారు. హంసరాలి పంచాయతీలోని గిరిజన గ్రామాలకు కనీసం రహదారులు కూడా నిర్మించలేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మాత్రమే రోడ్లు నిర్మించామన్నారు. 60 ఏళ్ల పాలనలో అభివృద్ధి జరుగలేదని, మూడున్నర ఏళ్లలో రూ.3.50 కోట్లతో ఈ ప్రాంతంలో అభివృద్ధి చేసుకున్నామన్నారు. మందవూరుకు రోడ్డుతో పాటు రెండు, మూడు సమస్యలున్నాయని.. వీటన్నింటిని పరిష్కరించాకే ఓట్లు అడగడానికి వస్తామన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న మంత్రి అప్పలరాజు

వలంటీర్ల సేవలు అభినందనీయం

హంసరాలిలో జరిగిన సభలో అవార్డులు పొందిన గ్రామ వలంటీర్లను మంత్రి సీదిరి ఘనంగా సన్మానించారు. ప్రతిఫలం ఆశించక వలంటీర్లు సేవలందిస్తున్నారని, వారికి సన్మానం చేయడం సముచితమన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయక బాధ్యతలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా సవర నాగేశ్వరరావు(కొండలోగాం), నెమలపురి రవి(రాంపురం)లకు సేవా వజ్రపురష్కారం, శిగలపల్లి పుష్పలత(ఉమాగిరి), కొల్లి చామంతి(జిల్లుండ), తమిరియా సుజాత(బెల్లుపటియా), దున్న ఖగేశ్వరరావు(సువర్ణాపురం), బొడ్డు స్వాతి (బహడపల్లి)లకు సేవారత్న పురస్కారాలు, దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం మంత్రి అప్పలరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల ఆవశ్యకతను వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ప్రభుత్వ పథకాలు అందలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతుండగా తీవ్రమైన ఎండతో కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు. వెంటనే అక్కడ ఉన్న నాయకులు మేల్కొని ఫ్యాన్‌ను ఏర్పాటు చేయడంతో కోలుకున్నారు. సర్పంచ్ బురద జగదీశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దాన య్య, జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరా వు, పార్టీ నాయకులు సవర నీలకంఠం, రుంకు ధర్మారావు, తమరి శోభన్‌బాబు, మామిడి రాజారా వు, ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎస్.అమ్మినాయు డు, ఏఈలు గార రామ్మోహనరావు, ప్రసన్నకుమార్, ఎంఆర్ఐ సవర చిన్నారావు, ఏపీఓ బి.వి.హరికృష్ణ, ఏపీఎం గొడబ ప్రసాదరావు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి



కాశీబుగ్గ: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సుందరయ్య సమరశీల పోరాటం సాగించారని యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళని యూటీఎఫ్ నాయకుడు బత్తిని ఒంకారం అన్నారు. సుందరయ్య వర్ధంతి సభను స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సుందరయ్య నిరాడంబర, నిస్వార్థ జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మతతత్వంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి వారి మధ్య ఐక్యతను దెబ్బ తీసిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నెయ్యిల గణపతిరావు, ప్రజాసంఘాల నాయకుడు టి.అజయ్‌కుమార్, ఐద్వా నాయకుడు ఎన్.ఢిల్లేశ్వరి, జన్ని భాగ్యలక్ష్మి, తెలుగు పండితులు పి.శశిధరవర్మ, కార్మిక సంఘం నాయకులు సుందరి, వీరాస్వామి పాల్గొన్నారు.



కంచిలి: రక్తదానం చేస్తున్న యువకుడు

కంచిలి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం ప్రతినిధి కప్ప గోపీనాథ్ అన్నారు. బూరగాం గ్రామంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు బి.అప్పారావు, జైభీమ్ చైతన్య సేవా సంఘు నాయకులు గంగారావు, గాంధీ, సత్యం, కాశీబుగ్గ ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు సాయి, దాసు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు బమ్మిడి అనందరావు, సీఐటీయూ నాయకుడు నెయ్యిల మోహన్ అన్నారు. నగరంపల్లిలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు, చంద్రయ్య, టి.భాస్కర రావు, ఎన్.బైరాగి, ఈశ్వరమ్మ, పుష్పలత ఉన్నారు.

పకడ్బందీగా 'జగనన్నకు చెబుదాం'



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కంచిలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజలకు ఉపయోగపడే 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.అప్పలస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ విషయమై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రోజూ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ప్రతీ సచివాలయం పరిధిలో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఇందులో అలసత్వం ప్రదర్శించినవారిపై జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్
- ఏపీఈపీడీసీఎల్ అధికారికి వినతి



సూర్యప్రతాప్‌తో మాట్లాడుతున్న పిరియా విజయ, సాయిరాజ్

కంచిలి: ఉద్దానం ప్రాంతం తుఫాను పీడిత ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ కోరారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్సు సూర్యప్రతాప్‌ను విశాఖలో శుక్రవారం కలిసి విన్నవించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ అంతరాయాన్ని నివారించడానికి కొబ్బరి తోటలు గల ప్రాంతాల్లో కవిటి నుంచి మాణిక్యపురం వరకు కవర్ కేబుల్ ఏర్పాటు చేయాలని, త్రీఫేజ్ లైన్‌ను కవిటి మండల పరిధిలో అన్ని సబ్‌స్టేషన్‌లు కలుపుతూ కవిటి నుంచి మాణిక్యపురం వరకు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నూతనంగా చేపడుతున్న కవిటి టౌన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలని, బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయాన్ని నివారించడానికి రాజపురం నుంచి బొరివంక సబ్‌స్టేషన్ వరకు ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు, నియోజకవర్గం పరిధిలోని డయాలసిస్ యూనిట్లకు విద్యుత్ హెచ్చుతగ్గలను నియంత్రించాలి, అంతరాయలంలేని విద్యుత్ సరఫరా చేపట్టాల కోరారు. ఈ అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయం వారు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: రాజపురం ఏపీమోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి జూన్ ఏడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు.

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి చెందిన విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుముగా చెల్లించాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

26వ తేదీలోగా సంజాయిషి ఇవ్వాలి

టెక్కలి: శ్యామసుందరాపురం సమీపంలోని జగతి మెట్ట వద్ద వైఎస్సార్ జగనన్న కాలనీలో ఎటువంటి ఇళ్ల పట్టాలు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న వారికి ఇచ్చిన నోటీసులకు ఈ నెల 26వ తేదీలోగా సంజాయిషి ఇవ్వాలని సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. లిఖితపూర్వకమైన సంజాయిషీ ఇవ్వాలని.. లేనిపక్షంలో తదుపరి చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో మంచి నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే పంపు హౌస్‌లోని రెండు మోటార్లు మరమ్మతులకు గురవ్వడంతో రోజూ నీటి సరఫరాకు అంతరాయం తలెత్తినట్లు పేర్కొన్నారు. మోటార్లు బాగుచేసిన వెంటనే నీటిసరఫరా యథావిధిగా జరుగుతోందని..ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ బీమా మంజూరు

నందిగాం: నందిగాంలోని గణేష్ కాలనీకి చెందిన పాత్రో మల్లేసు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య చంద్రమ్మకు వైఎస్సార్ బీమా రూ. రూ.5 లక్షలు మంజూరైంది. బీమా కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోనే బ్యాంకు ఖాతాకు బీమా సొమ్ము జమ కావడంపై చంద్రమ్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.


వార్డు వలంటీర్ల సత్కారానికి చర్యలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 16 సచివాలయాలకు చెందిన వార్డు వలంటీర్ల సత్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ జి.సీతారాం తెలిపారు. వార్డు సచివాలయం అడ్మిన్లు తేదీలు, వేదికలను గుర్తించి వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి వలంటీర్లను సత్కరించాలన్నారు. కార్యక్రమ వివరాల నివేదికను మున్సిపల్ కార్యాలయానికి అందజేయాలన్నారు.

సచివాలయాల సందర్శన

సోంపేట: విధినిర్వహణలో అలసత్వం చూపొద్దని సోంపేట-1, 2 సచివాలయాల ఉద్యోగులకు ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. రెండు సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య వ్రతాలు



ఇచ్ఛాపురం:108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా పెట్టిన దృశ్యం

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో సావిత్రి అమావాస్య వ్రతాల్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జేష్ట అమావాస్య నాడు ఐదోతనానికి బలాన్నిచ్చే సావిత్రి వ్రతాన్ని ఆచరించడం సంప్రదాయం. ఈ సీజన్‌లో పండే పంటలైన పనస, మామిడి, జీడి, అరటి, తాటిముంజెలు, ఈతపండ్లను భక్తులు నైవేద్యంగా సమర్పించారు.

అమావాస్య పూజలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని విష్ణు ఆలయంలో మాంగళ్యవృద్ధి, సంతాన వృద్ధి, కుటుంబ సౌఖ్యాన్ని కోరుతూ ఒడియా మహిళలంతా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కస్పాగొడ వీధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి, పనస, తాటి ముంజెలుతో పాటు పలురకాల ఫలాల, పసుపు, కుంకుమతో పాటు 108 రకాలు ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ అధికారులు


కంచిలి: ప్రజలు పరిసరాలను పరిరక్షించుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మందస డీఆర్వో ఐ.రాము అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమాన్ని కాశీబుగ్గ రేంజర్ ఏఎంకే నాయుడు సూచనల మేరకు ఈ నెల 14 నుంచి జూన్ నెల ఆరో తేదీ వరకు చేపడుతున్న క్రమంలో శుక్రవారం కంచిలి, సోంపేట పట్టణాల్లో జనసామర్థ్యం ఎక్కువగా ఉన్న కూడళ్లలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ సంచులను వాడాలని, ఇంకుడు గుంతలు తవ్వి భూగర్భ జలాలు అభివృద్ధి చేసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని వ్యాధులను అరికట్టాలని అన్నారు.అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయిం చైతన్య పరిచారు. బీటు అధికారులు వెంకటేష్, పోలయ్య, దుర్గాదేవి, భానుమూర్తి, జోగారావు, సురేష్, బాబూరావు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన కంచిలి విద్యార్థులు

కంచిలి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని గుర్తించి, వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పారితోషికాలు అందించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విడుదల చేసిన జాబితాలో కంచిలి మండల విద్యార్థులు జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు, నియోజకవర్గస్థాయిలో ఐదో ర్యాంకుల్లోను నిలిచారని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు గేదెల నందిని, గుజ్జు ధనలక్ష్మిలు 583 మార్కులు చొప్పున సాధించి జిల్లాస్థాయిలో రెండో ర్యాంకును సాధించారన్నారు. అలాగే ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో కూడా కంచిలి మండలం మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు నందిని, ధనలక్ష్మిలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లోను, ఇదే విద్యాలయానికి చెందిన పైల చాందిని 581 మార్కులతో నాలుగో స్థానంలోను, ముండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శృతి బెహరా 582 మార్కులతో మూడో స్థానంలో, కంచిలి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల విద్యార్థి బోనాల హరిబాబు 581 మార్కులతో 5వ స్థానంలో నిలిచాడు. వీరికి ప్రభుత్వం తరపున జిల్లాస్థాయిలో నిలిచిన వారికి ఈ నెల 27న, నియోజకవర్గస్థాయిలో నిలిచిన వారికి ఈ నెల 25న ప్రకటించిన పారితోషికాలు అందిస్తారు.

దాతల భాగస్వామ్యం అవసరం

– మంత్రి అప్పలరాజు



నర్సింగపురంలో సచివాలయాన్ని మంత్రి అప్పలరాజు

మందస: ప్రభుత్వ పథకాలకు దాతలు భాగస్వామ్యమైతే పల్లెలు మరింత అభివృద్ధి చెందుతాయని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. నర్సింగపురం పంచాయతీ దేవపురంలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, బస్‌షెల్టర్, నర్సింపురంలో నిర్మించిన సచివాలయాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల నిర్మాణానికి కొన్ని ప్రాంతాల్లో స్థలం కొరత వేధిస్తోందన్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి.. స్థలాలను అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలకు దాతలు, పెద్దలు ముందుకు వచ్చి సహకరిస్తే సమాజానికి మేలు కలుగుతుందన్నారు. స్థలం దానం చేసిన ఉప్పాడ రాజారావు, నగేశల దాతృత్వాన్ని అభినందించారు. అభివృద్ధి పనులకు సహకరించిన పినకాన రాజు, తమిరి శోభన్‌బాబు, ఇరుగోటి గురుమూర్తిలను ప్రశంసించారు. సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, సర్పంచ్ గేదెల పద్మనాభం, ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సవర ఢిల్లేశ్వరి, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, తహసీల్దార్ బడే పాపారావు, నాయకులు శానాపతి కిషోర్‌కుమార్, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, మల్ల నిరాకర్, సిందిరి జగన్, కొండల ఢిల్లేశ్వరరావు, మద్దిల రామారావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్



పరీక్షలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలను టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు, పరీక్షల నిర్వాహణ తీరును తెలుసుకున్నారు.

వలంటీర్లు సేవా దృక్పథంతో పనిచేయాలి



పలాస: వలంటీర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పలాస: గ్రామ వలంటీర్లు సేవాదృక్పథంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు చెప్పారు. బ్రాహ్మణతర్లా సచివాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బాడాన పుష్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 23 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు లండ శ్రీధర్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, గ్రామ పెద్ద దంతం వైకుంఠరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు మొదలయ్యాయి. లఖిదాసుపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది లఖిదాసుపురం, లింగాలపాడు, దిమిలాడ గ్రామాల్లో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మొదటి రోజు 21 మంది ఆరో తరగతిలో చేరేందుకు నమోదు చేసుకున్నారు. దిమిలాడ సర్పంచ్ బొంగి హనుమంతురావు, మాదిన వెంకటరమణమూర్తి, ఉపాధ్యాయులు ఆర్.రామారావు, తులసీప్రసాద్, బి.రత్నం, డి.శ్రీనివాస్, వై.త్రినాథరావు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, పక్కన కృష్ణదాస్

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లాఠకర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన క్రిష్ణదాస్‌తో కలిసి వెళ్లి ఎమ్మెల్సీ నర్తు రామారావు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలిశారు. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ గ్రామ రైతులు బాహుదా నదిపై వెయ్యి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన బెల్లుపడ గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టాలని, బాహుదా నది ఎడమ వైపున ఒడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్సీ తీసుకెళ్లారు. అలాగే బెల్లుపడ గ్రామం వద్ద గ్రోయిన్‌కు టెంపరరీ రీస్టోరేషన్ పనులు చేపట్టాలని, ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ గ్రామం సమీపంలో ఎడమవైపు వరద కాలువ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమం



తిర్లంగిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

టెక్కలి: గ్రామ సచివాలయాల పరిధిలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. లింగాలవలస, తిర్లంగి గ్రామ సచివాలయాలతో పాటు చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లో సిబ్బంది హాజరు, అందజేసిన సంక్షేమ పథకాలు, సంక్షేమ పథకాలపై అవగాహన తదితర అంశాలపై ఆరా తీశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నంబరుపై గ్రామ స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.